జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 18-3-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 618 పేజీలు: 4 వెల : రూ.7

# మూలపేట పోర్టుకు.. లైన్‌క్లియర్





* 385.24 ఎకరాల భూమి బదలాయింపు ఉత్తర్వులు విడుదల
* సమస్య ఒడ్డుకు చేరడంతో మరింత వేగంగా పోర్ట్ నిర్మాణం
* కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఏపీ మారిటైం బోర్డును సమన్వయం చేసిన రామ్మోహన్
* ఉగాది ముందు శుభవార్త తెచ్చిన శ్రీకాకుళం ఎంపీ

**శ్రీకాకుళం/సంతబొమ్మాళి, మార్చి 17(వార్త):** మూలపేట పోర్టు నిర్మాణ క్రమంలో కీలక సమస్యగా మారిన 385 ఎకరాల సాల్ట్ ల్యాండ్స్ సమస్య కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో పరిష్కారం అయింది. ఇందుకు సంబంధించి భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం నుండి మంగళవారం అధికారిక ఉత్తర్వులు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశను మార్చే కీలకమైన ప్రాజెక్ట్ మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణాన్ని కీలకంగా తీసుకున్న కూటమి సర్కారు.. తాము అధికారంలోకి వచ్చింది మొదలు పనుల్లో వేగాన్ని పెంచింది. సమస్యలను సరిచేస్తూ.. నిత్యం సమీక్షలు చేస్తూ.. నిర్మాణంలో తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం అనుసంధాన రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే ఇదే తరుణంలో పోర్ట్ నిర్మాణంలో వీరికి ప్రధాన సమస్యగా మారింది నౌపాడ పరిధిలోని ఉప్పు భూముల సమస్య. మొత్తంగా 385.24 ఎకరాల సాల్ట్ భూములు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖా పరిధిలోని అంతర్గత వాణిజ్య విభాగం, సాల్ట్ విభాగం పరిధిలో నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరీ ఆధీనంలో ఉన్నాయి. వీటిని పోర్ట్ నిర్మాణం కోసం అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వానికి, ఎపి మేరిటైం బోర్డుకు మధ్య చర్చలు నడుస్తూనే ఉన్నాయి. మూలపేట పోర్ట్ నుండి టెక్కలిని, జాతీయ రహదారిని అనుసంధానించేందుకు ఈ 385.24 ఎకరాలు కీలకంగా మారాయి. వీటి మీదుగానే వంద ఎకరాల పరిధిలో 330 అడుగుల విశాల రహదారులు, భవిష్యత్ ఎగుమతి, దిగుమతులకు సరిపడ మౌలిక వసతులను నిర్మించాలి. వీటితో పాటు సుమారు 280 ఎకరాలు ప్రధాన పోర్ట్ విస్తరణ కోసం అవసరం కానుంది. అయితే ఈ భూముల అప్పగింతపై ఏకాభిప్రాయం రాకపోవడంతో పోర్ట్ నిర్మాణంకు ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. అవకాశం దొరికిన ప్రతీసారి కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖతో, డైరక్టర్ ఆఫ్ పోర్ట్స్, పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ సి.ఈ.ఓ, మేరిటైం బోర్డ్, శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం ఇలా వరుసగా భేటిలు, సమీక్షలు నిర్వహించారు. ఈ నేపధ్యంలో మంగళవారం ఈ భూములను నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరి నుండి ఎపి మేరిటైం బోర్డ్ కు 99 ఏళ్ల లీజు ప్రాతిపదికన అప్పజేప్పుతున్నట్టు అధికారిక ఉత్తర్వులు రావడంతో శుభవార్తను రామ్మోహన్ నాయుడు జిల్లా వాసులకు తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా, ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశను మార్చనున్న మూలపేట పోర్ట్ విషయంలో తాజా సమస్య పరిష్కారంతో కీలక అడ్డంకి తొలగిందని ఆనందం వ్యక్తం చేశారు. అన్ని అడ్డంకులు తొలగుతూ ఉండటంతో మరికొద్ది నెలల్లోనే మూలపేట పోర్ట్ అందుబాటులోకి వస్తుంది అనే ధీమాను రామ్మోహన్ నాయుడు వ్యక్తం చేశారు. ఈ అధునాతన గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ లో మొత్తంగా మూడు కార్గో బెర్తులు, ఒక కోల్ బెర్త్, ఇతర అధునాతన సదుపాయాలు ఉండనున్నాయి. ఎగుమతి, దిగుమతుల విషయంలో ఆంధ్రప్రదేశ్ లోనే భవిష్యత్ లో కీలకంగా మారనుంది మూలపేట పోర్టు. కూటమి సర్కారు బాధ్యత తీసుకున్న తరువాత స్థానిక మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుల చొరవతో శరవేగంగా నిర్మాణ పనులు పూర్తి అవుతుండటం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సాగునీటికి.. పోరాటం



* ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడిచిపెట్టాలని రైతుల ధర్నా
* గొట్టాబ్యారేజి వద్ద బైఠాయింపు
* ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడిచిపెట్టండి
* ఎవరి కోసం స్పిల్‌వే ద్వారా నీటిని వదులుతున్నారు
* మా పంటలు నీరు లేక ఎండిపోతున్నాయి
* గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయ సిబ్బందిని నిలదీసిన రైతులు
* స్పిల్‌వే ద్వారా నీటిని నిలుపుదల చేసిన సిబ్బంది
* ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడిచిపెట్టకపోతే ఉద్యమిస్తామన్న రైతులు
* రైతులు, గొట్టాబ్యారేజీ అధికారులతో పోలీసులు చర్చలు

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, మార్చి 17(వార్త):** సాగునీటి కోసం వంశధార ఆయకట్టు రైతులు కన్నెర్ర చేశారు. దిగువ ప్రాంతాలకు వృధాగా సాగునీటిని విడిచిపెడుతున్నారంటూ అధికారులపై మండిపడ్డారు. గొట్టాబ్యారేజి ఎడమ ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేయకుండా గొట్టాబ్యారేజి స్పిల్‌వే ద్వారా దిగువకు నీటిని సంబంధిత అధికారులు విడిచిపెడుతుండటంతో ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా చేపట్టారు. ఈ మేరకు రైతులు మాట్లాడుతూ ఎడమ ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని నిలుపుదల చేయటంతో రబీలో వేసిన పంటలు పూర్తిగా పాడవుతాయని, పంటలు సాగుచేయటానికి వేల రూపాయల్లో ఖర్చు పెట్టడం జరిగిందని,మరో 20 నుంచి 25 రోజుల్లో పంటలు చేతికి వస్తుందన్న తరుణంలో ఎడమ ప్రధాన కాలువ ద్వారా సాగవుతున్న నీటిని నిలుపుదల చేసి గొట్టాబ్యారేజి దిగువకు విడిచిపెట్టడం ఏంటని ప్రశ్నించారు. మరో 20 రోజుల్లో పంటలు చేతికి వస్తుందని, ఇంతలోనే ఎడమ ప్రధాన కాలువ ద్వారా విడుదల అవుతున్న నీటిని నిలిపివేయటం తగదన్నారు. తక్షణమే గొట్టాబ్యారేజి దిగువకు విడిచిపెడుతున్న నీటిని నిలుపదల చేసి ఎడమ ప్రధాన కాలువకు నీటిని విడిచిపెట్టాలని వారు డిమాండ్ చేశారు. సుమారు గంట సేపు రైతులు ధర్నా చేయటంతో హిరమండలం, పాతపట్నం వైపు వెళ్లాల్సిన వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రైతులతో పాటు గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయ సిబ్బందితో చర్చలు జరిపారు. దీంతో గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయ సిబ్బంది జిల్లా అధికార యంత్రాంగానికి సమాచారం అందజేయటంతో గొట్టాబ్యారేజి స్పిల్‌వే ద్వారా విడుదల అవుతున్న నీటిని నిలుపుదల చేశారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 20 నుంచి 25 రోజుల పాటు సాగునీరు అందజేయకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ ధర్నాలో ఎడమ ప్రధాన కాలువ పరిధిలో ఉన్న భగరధీపురం, పింద్రువాడ, అంబావల్లి, రెల్లివలస, అక్కరాపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



## ఇంటి పన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ మాఫీ

**శ్రీకాకుళం, మార్చి17(వార్త):** శ్రీకాకుళం నగర ప్రజలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలపై ఉన్న వడ్డీలో 50శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని నగరపాలక సంస్థ కమిషనర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ రాయితీని పొందాలనుకునే వారు ఈనెల 31లోపు తమ అసలు పన్ను బకాయిలతో పాటు, మిగిలిన 50 శాతం వడ్డీని ఏకకాలంలో చెల్లించాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం ఈనెల 31 వరకు అన్ని సెలవు దినాల్లోనూ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9:30 నుండి సాయంత్రం 6:00 గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

## రెండు వారాల్లో.. నగరం శుభ్రంగా ఉండాలి

* తీసే చెత్త డస్ట్ బిన్‌లోనే వేయాలి
* కాలువలు ప్రక్కలో చెత్త వేయొద్దు
* జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం, మార్చి17(వార్త):** రెండు వారాల్లో శ్రీకాకుళం నగరాన్ని శుభ్రంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. మంగళవారం బాపూజీ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన పరిశుభ్రతపై మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రోడ్లపై ఉన్న చెత్తను తీసి డస్ట్ బిన్‌లో మాత్రమే వేయాలన్నారు. రోడ్లు, కాలువలు శుభ్రం చేసినపుడు పారిశుధ్య కార్మికులు గ్రూపుగా ఉండి పనిచేయాలన్నారు. ఒక్కొక్కరిగా ఉండి పని చేయరాదని, ఖాళీ స్థలాల్లో చెత్త వేయరాదన్నారు. ఇంటింటి చెత్త సేకరణ జాగ్రత్తగా చేయాలన్నారు. ప్రతీ ఇంటి వద్ద ఉన్న చెత్త సేకరించాలని పేర్కొన్నారు. ఇంటిలో ఉన్న చెత్త బయట పారవేయకుండా ఇంటి యజమానులకు చెప్పాలన్నారు. బాగా పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని చెప్పారు. పారిశుధ్య కార్మికులపై గౌరవం ఉంటుందన్నారు. ప్రతీ రోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయాల్సిందేనన్నారు. కాలువల ప్రక్క చెత్త ఉండరాదన్నారు. చేసిన పనే గుర్తింపు ఇస్తుందన్నారు. గ్లౌజులు తప్పనిసరిగా ధరించి ఉండాలని ఆదేశించారు. గ్లౌజులు ధరించకపోతే హాజరు ఉండదని స్పష్టం చేశారు. ఇఎస్ఐ కార్డులు, పిఎఫ్ ఉన్నదీ లేనిదీ పారిశుధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించేందుకు విచ్చేసిన రాజమండ్రి కార్పొరేషన్‌కు సంబంధించి ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ మాధవి, మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ సుధీర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు నేటి నుంచి ఉచిత బస్సు ప్రయాణం

**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం మేరకు జిల్లాలోని దివ్యాంగులకు బుధవారం నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి అప్పలనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులందరికీ ఉచిత ప్రయాణం సదుపాయం కల్పించబడుతుందన్నారు. ఇప్పటివరకు దివ్యాంగులకు హాఫ్ టికెట్ (సగం చార్జీ) పాస్ మాత్రమే అమల్లో ఉండేదన్నారు. ప్రభుత్వం తాజా నిర్ణయంతో పూర్తి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం దివ్యాంగుల రోజువారీ అవసరాలు, విద్య, ఉపాధి, వైద్య అవసరాల కోసం ప్రయాణాన్ని సులభతరం చేయడమేనని తెలిపారు. ఈ పథకాన్ని వినియోగించుకోవాలంటే సంబంధిత దివ్యాంగులు ముందుగా ప్రత్యేక బస్ పాస్‌ను పొందవలసి ఉంటుందన్నారు. ఈ పాస్‌ను శ్రీకాకుళం, టెక్కలి, పలాస ఆర్టీసీ బస్టాండ్లలో జారీ చేస్తారని తెలిపారు. ఒక్కసారి పొందిన ఈ పాస్ మూడు సంవత్సరాల పాటు చెల్లుబాటు అవుతుందని, కాలపరిమితి ముగిసిన తర్వాత తిరిగి పునరుద్ధరించుకోవాలని సూచించారు. పాస్ పొందేందుకు దివ్యాంగత శాతం నిర్ధారించే వైద్య ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు వంటి అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గెడ్డలో పడి యువకుడి మృత్యువాత



**పలాస, మార్చి 17 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం ఉండ్రుకుడియ సమీప గెడ్డలో ఓ యువకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పలాస మండలం లొత్తూరు పంచాయతీ చిన్నపలియా గ్రామానికి చెందిన సవర భాస్కరరావు(36) ఈనెల 14న రాత్రి మెళియాపుట్టి వైపు నుంచి పలాస వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఉండ్రుకుడియ మలుపు వద్ద ప్రమాదవశాత్తు గెడ్డలో పడిపోవడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు ఈ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో వారు దాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ వైకుంఠరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ పంపిణీ



**ఇచ్ఛాపురం, మార్చి 17 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి రత్తకన్న 18వ వార్డులో గల గొర్ల సోమేశుకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. భార్య గొర్ల త్రివేణికి రూ.1,27,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను విప్ అశోక్‌బాబు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, వార్డు ఇన్‌చార్జి లంక ప్రకాష్ ,19 వార్డు ఇన్‌చార్జి బుగత జగన్, 20 వార్డు ఇన్‌చార్జి సుభాష్ రౌలో తదితరులు పాల్గొన్నారు.

## బకాయిలు చెల్లిస్తేనే ఉన్నతి రుణాలు



**మందస, మార్చి 17(వార్త):** షెడ్యూలు కులాలు, తెగలకు సంబంధించిన పంచ సూత్రాలు పాటిస్తున్న స్వయం శక్తి సంఘాలలో అర్హత గల సభ్యుల ఆదాయాభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఉన్నతి రుణాలను, పాత బకాయిలు చెల్లించి పొందవచ్చని వెలుగు గ్రామీణాభివృద్ధి సంస్థ మందస అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. తాళ్లగురంటి పంచాయతీ పరిధిలో గల బలరాంపురం, చిన్న కోస్టా గ్రామాలలో ఏర్పాటు చేసిన వీఓ పాలక వర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గతంలో తీసుకున్న పాత బకాయిలు పూర్తిగా చెల్లించిన సంఘాలు కొత్తగా వడ్డీ లేకుండా ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఉన్నతి రుణాలను పొందడానికి అర్హతను పొందుతారని వివరించారు. మంచి ఎంటర్‌ప్రైనర్ యాక్టివిటీ చేస్తారన్న వారికి వీఓ తీర్మానం ఆధారంగా ట్రైకార్ సబ్సిడీ రుణాలు పొందడానికి ఐటీడీఏకు ప్రతిపాదనలు కూడా పంపిస్తామని తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వం స్త్రీనిధి ద్వారా మహిళా కుటుంబాలకు ఎన్టీఆర్ విద్యాలక్ష్మి, కల్యాణలక్ష్మి పథకాలను కూడా అమలు పరుస్తుందని, వీటన్నింటికీ అర్హత సాధించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు, క్లస్టర్ కోఆర్డినేటర్ కొబగాపు రమేష్ తో పాటు వీఓఏలు ప్రతాప్, చంద్రశేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ తెప్పల అజయ్‌కుమార్‌కు పరామర్శ




**మందస, మార్చి 17(వార్త):** కామ్రేడ్ తెప్పల అజయ్‌కుమార్, డాక్టర్ తెప్పల ఆనందరావును అగ్ని కుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరెక్టర్ జుత్తు నీలకంఠం, మాజీ సర్పంచ్ బత్తిని అప్పలస్వామి, సర్పంచ్ సైన దేశయ్య, కుత్తుం లోకనాథం, రాపాక చిన్నారావు మంగళవారం పరామర్శించారు. వీరి తల్లి ఆదిలక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఆమె మృతికి ప్రగాఢ సంతాపం తెలుపుతూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆ కుటుంబం ప్రజా ఉద్యమంలోనే కొనసాగుతోందని, ఆదిలక్ష్మి మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటన్నారు. వీరి వెంట పలువురు పెద్దలు ఉన్నారు.

## విద్యార్థుల చేరికల కోసం అడ్మిషన్ డ్రైవ్



**నరసన్నపేట, మార్చి 17(వార్త):** నరసన్నపేట మండలం కుమ్మరి పేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల చేరికలను పెంచే లక్ష్యంతో మంగళవారం గ్రామంలో అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు వంటి సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు కల్పించబడుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తుకు మంచి పునాది వేయడంలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొన్నారు. అలాగే అంగన్వాడి సిబ్బంది కూడా పాల్గొని విద్యార్థుల చేరికలపై అవగాహన కల్పించారు.

## ఘనంగా నూకాలమ్మ తల్లి సంబరం



**ఇచ్ఛాపురం, మార్చి 17(వార్త):** సంతపేట జంక్షన్ వద్ద కొలువు తీరి ఉన్న నూకాలమ్మ సంబరాన్ని ఆలయ ధర్మకర్త కాళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. మంగళవారం ఉదయం నుండే ఆలయంలో ప్రత్యేకంగా అమ్మవారికి సిందూర మర్దన, కుంక మార్చనలు పంచామృతాలతో అమ్మవారి అభిషేకాలు జరిపించారు. అనంతరం పూజలు జరిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణలో ఏర్పాటు చేసిన అన్న సంతర్పణలో వందలాది మంది భక్తులు వచ్చి అన్నప్రసాదాలను స్వీకరించారు.

## రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

**నరసన్నపేట, మార్చి 17(వార్త):** యారబాడు ఆర్ఎంకే కేంద్రంలో మంగళవారం "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సూర్య కుమారి పాల్గొని రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు తమ పంటలకు సంబంధించిన ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులు పండించే పంటలకు మద్దతు ధరను కల్పిస్తున్నదని తెలిపారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత బలపడాలని కోరారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ ఆధునిక పద్ధతులను అనుసరించాలని, దిగుబడులు పెంచుకోవడానికి శాస్త్రీయ విధానాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బల్లగుద్ది చెబుతున్నా..ప్రజా సేవ చేశా..!

-చివరి సమావేశంలో చైర్మన్ గిరిబాబు

-తూతు మంత్రంగా ముగిసిన సభ

-పాలకవర్గం పదవీకాలం ముగింపు





**పలాస, మార్చి 17(వార్త):** ప్రజలకు ప్రజా సేవ చేసే భాగ్యం కలిగిందని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ పురపాలక సంఘ నాలుగో కౌన్సిల్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన చివర సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలో పేర్కొన్న 12 అంశాలకు సంబంధించి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కాగా మున్సిపాలిటీలో ఇంటింటికీ కొత్త నీటి కొళాయి కనెక్షన్లకు ఆయా వినియోగదారులు చెల్లించాల్సిన రుసుము రూ.10 వేలను విడతల వారీగా చెల్లించే అవకాశం కల్పించాలని 11వ వార్డు కౌన్సిలర్ దుర్గా శంకర్ పండ కోరగా, వెసులుబాటు కల్పిస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీముల విషయాన్ని సీనియర్ కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, పి.ప్రసాద్ ప్రస్తావించారు. కాశీబుగ్గ పాత జాతీయ రహ దారి పక్కన ఉన్న మురికి కాలువ నిర్మాణం వంకరటింకరగా నిర్మించారని, దీనిపై టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ అధికారులు తప్పుడుగా వ్యవహరించారని పలువురు కౌన్సిలర్లు కమిషనర్ దృష్టికి తీసుకురాగా దీనిని సరిచేస్తామని కమి షనర్ శ్రీనివాసరావు సమాధానం ఇచ్చారు.

అనంతరం చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ ఐదేళ్లలో సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పురపాలక సంఘాన్ని అభివృద్ధి పథంగాగా దిశగా తీసుకెళ్లామని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# భోజనంతో ఎమ్మెల్యే శిరీష

-కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

-విద్యార్థులతో కలిసి నేలపైనే

మధ్యాహ్న భోజనం ఆరగింపు

**పలాస, మార్చి 17 (వార్త):** కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని సౌకర్యాలను, విద్యాబోధనను పరిశీలించిన ఆమె, అనంతరం విద్యార్థులతో కలిసి కాసేపు ముచ్చటించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన చేస్తూ పరిస్థితిపై ఆరా తీశారు. పాఠశాలకు వెళ్లిన ఎమ్మెల్యే, విద్యార్థులతో పాటే కింద కూర్చుని 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని' స్వయంగా రుచి చూశారు. ఆహారం నాణ్యతగా ఉందని, రుచిపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. పౌష్టికాహారంపై ఆరా తీస్తూ కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం మెనూ ప్రకారం సక్రమంగా అందుతుందో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్ననాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.




# స్వచ్ఛ రథం ప్రారంభం

-పారిశుధ్యంపై ప్రజలు చైతన్యవంతులు కావాలి

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**సారవకోట, మార్చి 17(వార్త):** గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచడానికి ప్రతి ఒక్కరూ తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి నిర్వహించాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం సారవకోటలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెత్త నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఇంటి వద్ద నుంచే చెత్తను వర్గీకరించడం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా తగ్గుతాయని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, పాడైన ఇనుప పరికరాలు వంటి రీసైకిల్ చేయగల వస్తువులను స్వచ్ఛ రథానికి అప్పగిస్తే, వాటి విలువను అంచనా వేసి ప్రతిగా నిత్యావసర వస్తువులు అందజేయడం జరుగుతుందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. ఈ స్వచ్ఛ రథం ద్వారా పారిశుధ్యంపై అవగాహన పెంపొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, సారవకోట పిఎసిఎస్ ఛైర్మన్ సురవరపు తిరుపతిరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, మూకళ్ళ చిన్నయ్య మాస్టారు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, మండల తెలుగు యువత అధ్యక్షులు పిల్లా నంద కిషోర్, బోయిన రవి, నక్క గోపి, ఇప్పిలి ఆంజనేయ ప్రసాద్, ఇప్పిలి బాల, చల్ల ఆనంద్, తాడేల భీమారావు, తహశీల్దార్, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# దాత సహకారంతో శిథిల రహదారి పునర్నిర్మాణం

-లక్ష్మణరావును అభినందించిన స్థానికులు

**నరసన్నపేట, మార్చి 17(వార్త):** నరసన్నపేటలో ఇందిరానగర్ నుంచి హడ్కో కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ప్రయాణ ికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఇందిరానగర్‌కు చెందిన మండల పరిషత్ విశ్రాంత సూపరింటెండెంట్ లక్ష్మణరావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రహదారి మరమ్మతుల పనులు చేపట్టించారు. మంగళ వారం సిమెంట్‌తో రహదారి పునర్నిర్మాణ పనులు ప్రారంభించడంతో స్థానికులకు ఉపశమనం కలిగింది. దీర్ఘకాలంగా పరిష్కారం గాని సమ స్యకు స్వయంగా ముందుకు వచ్చి చర్యలు తీసుకోవడంపై స్థానికులు లక్ష్మణరావును అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఇటు వంటి వ్యక్తిగత చొరవ మరింత మందికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ చర్యతో రహదారి పరిస్థితి మెరుగుపడటంతో పాటు ప్రమాదాల అవకా శాలు తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## జగ్గయ్య కుటుంబానికి పరామర్శ



**ఇచ్ఛాపురం, మార్చి 17(వార్త):** బాలకృష్ణాపురం పంచాయతీ మాజీ వైస్ సర్పంచ్ బదకల జగ్గయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, ఎల్.పద్మనాభం, రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావురెడ్డి, ఎస్ సహదేవ్ రెడ్డి, కాళ్ల గోపి ఎంపీటీసీ సభ్యుడు బి.లోహిదాస్, చంద్రశేఖర్, రామారావు, ప్రసాద్, ప్రకాష్‌చంద్ర నాయక్, యు.శంకం నారాయణ, కూర్మారావు, ఢిల్లీ ఎర్రయ్య, గిన్ని బాలరాజు, కిరమణీ, చందు, మురళి, పురుషోత్తం, బి.గణపతి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం




**ఇచ్ఛాపురం, మార్చి 17(వార్త):** బొడ్డకలి గ్రామానికి చెందిన దక్కత రాజు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులను భరించడం వారికి కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న యువభారత్ సేవా ఫౌండేషన్ తేలుకుంచి సభ్యులు మానవత్వంతో ముందుకు వచ్చి రాజుకు రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

## రైతు సంక్షేమానికి కూటమి కట్టుబడింది




**నరసన్నపేట, మార్చి 17(వార్త):** రైతులకు అన్ని విధాలా సేవలందించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన తెలిపారు. మంగళవారం చిక్కాలవలసలోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో రైతులు మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి.. దిగుబడులను పెంచుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, అధికారులు పాల్గొని వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

## ఆసుపత్రి ముందు మురుగు నీరు

- దుర్వాసనతో స్థానికులకు ఇబ్బందులు

-అధికారులు స్పందించాలని డిమాండ్

**నరసన్నపేట, మార్చి 17(వార్త):** నరసన్నపేటలోని సామాజిక వైద్యశాల ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తూ తీవ్ర అపరిశుభ్రతకు కారణమవుతోంది. ఈ పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ప్రత్యేకంగా ప్రధాన వైద్య ఆరోగ్య కేంద్రం ముందు ఇలాంటి పరిస్థితులు నెలకొనడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు ఈ మురుగు నీటిని దాటుకుని వెళ్లాల్సి రావడం అసౌకర్యంగా మారిందని తెలిపారు. ఆరోగ్యానికి ముప్పుగా మారే ఈ సమస్యపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మురుగు నీటి ప్రవాహాన్ని నిలిపివేసి, శాశ్వత పరిష్కారం చూపించాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలి

### -విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించిన ఎంఈఓలు

**సారవకోట, మార్చి 17(వార్త):** ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే దిశగా గ్రామస్తులు సహకరించాలని ఎంఈఓలు మద్దు వెంకటరమణ, కోడి భూలక్ష్మి కోరారు. మంగళ వారం సారవకోట మండలం అలుదు మోడల్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల కోసం అనవసరంగా అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనతో పాటు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ఎంతో ముఖ్యమని, అందుకు గ్రామస్థుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు.

గ్రామంలో నిర్వహించిన ఈ ర్యాలీ ద్వారా విద్యపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# పలాసలో ఆగని కంకర మాఫియా

### -రాత్రుళ్లు మట్టి, కంకర వేట
### -కొండలపై దండెత్తిన అక్రమార్కులు
### -కోట్లలో దందా సాగిస్తున్న వైనం
### -నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న అధికారులు
### -ఇప్పటికైనా స్పందించాలని
### ఆయా గ్రామస్థుల డిమాండ్





**పలాస, మార్చి 16 (వార్త):** పలాస మండలంలో మట్టి-కంకర అక్రమ తవ్వకాల మాఫియా రోజురోజుకు రెచ్చిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొండలను లక్ష్యంగా చేసుకుని రాత్రి వేళల్లో జేసీబీలతో తవ్వకాలు జరిపిస్తూ టిప్పర్లలో మట్టి, గ్రావెల్‌ను తరలిస్తూ భారీ స్థాయిలో అక్రమ వ్యాపారం కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. పలాస మండలంలోని కంబిరిగాం, కొత్తూరు కొండ, రాజగోపాలపురం, మహదేవిపురం, లోద్దభద్ర కొండ, పెంటిభద్ర కొండ ప్రాంతాలు మట్టి-కంకర మాఫియా గుప్పెట్లోకి వెళ్లినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పగలు ప్రశాంతంగా కనిపించే ఈ ప్రాంతాలు రాత్రి పడితే మాత్రం జేసీబీలు, టిప్పర్ల శబ్దాలతో మారుమోగుతున్నాయని వారంటున్నారు. ప్రతి రాత్రి పదుల సంఖ్యలో టిప్పర్లు కొండల నుంచి మట్టిని లోడ్ చేసుకుని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం ఒక్క టిప్పర్ మట్టిని సుమారు రూ.5 వేల వరకు విక్రయిస్తూ భారీ స్థాయిలో అక్రమార్జన సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంకర ఇంకా అధిక ధర పలుకుతోందని వారంటున్నారు. ఈ విధంగా ప్రతిరాత్రి పెద్ద ఎత్తున మట్టి, కంకర తరలింపుతో నెలకు కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇక కోసంగిపురం జగనన్న కాలనీ సమీపంలోని కొండను కూడా తవ్వి గ్రావెల్‌ను వెంచర్లకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ తవ్వకాలతో కొండల ఆకృతి పూర్తిగా మారిపోతుండటంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ రాత్రి టిప్పర్లతో మట్టి, కంకర రవాణా జరుగుతున్నా సంబంధిత శాఖలు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన పోలీసులు, మైన్స్, రెవెన్యూ శాఖల అధికారులు మాత్రం మౌనం పాటిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ అండదండలతోనే ఈ మాఫియా దందా కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ తవ్వకాలకు వినియోగిస్తున్న జేసీబీలు, టిప్పర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే కొండలు పూర్తిగా కనుమరుగై ప్రకృతి వనరులు నాశనం కావడం ఖాయమని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు.

## సంక్షేమం నుంచి సంపద దిశగా రైతుల అభివృద్ధి



**ఇచ్ఛాపురం, మార్చి 17 (వార్త):** 'రైతన్న మీ కోసం' ప్రచార కార్యక్రమం"లో భాగంగా ఇచ్ఛాపురం మండలంలోని ఇన్నిసిపేట గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన "రైతన్న మీ కోసం" ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ అవకాశాలు, వ్యవసాయంలో పెట్టుబడులు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల స్థాపన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతులను సంక్షేమం నుంచి సంపద దిశగా తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి, వ్యవసాయ ఉప సంచాలకులు (సోంపేట) టి.భవానీశంకరరావు, శాస్త్రవేత్త ఉదయబాబు, మండల వ్యవసాయాధికారి అజయ్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సోనియా పాల్గొన్నారు.

## రెండు కిలోల గంజాయితో కేరళ వాసి అరెస్టు

### -మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్



**మందస, మార్చి 17(వార్త):** రెండు కిలోల గంజాయితో ఒకరిని అరెస్టు చేసినట్టు మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. మందస మండలంలోని రైల్వేస్టేషన్ సమీపంలో కేరళకు చెందిన ఎబిన్ దాస్ అనే వ్యక్తి రెండు కిలోల గంజాయిని తరలిస్తుండగా మంగళవారం పట్టుకున్నామన్నారు, ఆయనను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

## హరిపురంలో దొంగతనం

హరిపురంలో మంగళవారం దొంగతనం జరిగిందని ఎస్ఐ కృష్ణప్రసాద్ తెలిపారు. పెద్దవీధిలో పగలే ఈ దొంగతనం జరిగిందని,కేసు నమోదు చేశామన్నారు. సుమారు రెండు తులాల బంగారం చోరీకి గురైందని.. దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## బోరుబావి చుట్టూ ఆక్రమణలు

### -తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



**నరసన్నపేట, మార్చి 17(వార్త):** నరసన్నపేటలోని కోవెల వీధిలో పంచాయతీ నిధులతో నిర్మించిన బోరుబావి ప్రస్తుతం ఆక్రమణల మధ్య ఇరుక్కుపోయి, స్థానికులకు తాగునీటి వినియోగంలో తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. గతంలో ఈ ప్రాంత ప్రజలకు త్రాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరుబావిని ఏర్పాటు చేసినప్పటికీ, ఇటీవల బోరు చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఆక్రమణలతో బోరు వద్దకు చేరుకోవడం కూడా కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోవెల వీధి పరిసర ప్రాంతమంతా ఆక్రమణలు విస్తరిస్తున్నాయని, దీంతో ప్రజా వనరులు వినియోగానికి అనర్హంగా మారుతున్నాయన్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి బోరుబావిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. తాగునీటి వంటి మౌలిక అవసరాల విషయంలో నిర్లక్ష్యం తగదని, వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పారిశుధ్య పనుల పర్యవేక్షణ



**ఇచ్ఛాపురం మార్చి 17(వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 11వ వార్డులో పట్టణ సాయిరాం మహిళా పరపతి సమైఖ్య సమావేశంలో జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ ఆసి లీలా రాణి పాల్గొన్నారు. అనంతరం ఆమె ఆ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు.

## 'రైతన్న మీ కోసం'తో అన్నదాతలకు అండగా నిలుస్తా

### -ఎమ్మెల్యే గౌతు శిరీష



**మందస, మార్చి 17(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతన్న మీ కోసం' కార్యక్రమం ద్వారా వ్యవసాయాన్ని పండుగలా మార్చి, ప్రతి రైతు కుటుంబానికి అండగా నిలవడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని పొత్తంగి గ్రామంలో జరిగిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల సంక్షేమం కోసం 'పంచసూత్రాల' ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా, మా ప్రభుత్వం ప్రతీ రైతు గడప వద్దకు వచ్చి వారి సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వ పథకాలను వారికి వివరించి, వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రైతుల కోసం మా ప్రభుత్వం అమలు చేస్తున్న ముఖ్యమైన అంశాలను వివరించారు.

**జల భద్రత:** ప్రతి పొలానికి నీరు అందించడమే లక్ష్యంగా, డ్రిప్ మరియు స్ప్రింక్లర్ వంటి ఆధునిక సాగునీటి పద్ధతులను ప్రోత్సహిస్తున్నాం. ఎస్సీ/ఎస్టీ రైతులకు 100% సబ్సిడీతో వీటిని అందిస్తున్నాము.

సాంకేతిక పరిజ్ఞానం: వాతావరణ సమాచారం, పంటల ధరలు, పురుగుమందుల వాడకం వంటి వివరాలను రైతులు తమ ఫోన్‌లలోనే తెలుసుకునేలా యాప్‌లను అందుబాటులోకి తెచ్చాము. వ్యవసాయంలో డ్రోన్లు, ఆధునిక యంత్రాల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాము.

**ఆహార శుద్ధి:** మనం పండించిన పంటను నేరుగా అమ్మితే ఒక ధర వస్తుంది, అదే దానిని శుద్ధి చేసి, ప్యాక్ చేసి అమ్మితే ఇంకా ఎక్కువ ధర వస్తుంది. ఉదాహరణకు, టమాటాలను పండించి అమ్మడం కన్నా, వాటిని సాస్‌గా, పచ్చడిగా మార్చి అమ్మితే రెట్టింపు లాభం ఉంటుంది. దీనికోసం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి, చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోవడానికి ప్రభుత్వం మీకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుంది.

**ప్రభుత్వ మద్దతు:** 'అన్నదాత సుఖీభవ', 'పీఎం-కిసాన్' వంటి పథకాల ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నాము. పంటల బీమా, గిట్టుబాటు ధర కల్పించడం, మరియు సేంద్రియ ఉత్పత్తుల కోసం రైతు బజార్లను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నాము.

**ఆదాయం రెట్టింపు:** రైతుల ఆదాయాన్ని పెంచి, ఖర్చులను తగ్గించి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఆమె వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ పీరికట్ల విఠల్ రావు, తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, సాలిన మాధవరావు, లబ్బ రుద్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, ఔగాన ఈశ్వరరావు, చౌదరి మురళీకృష్ణ, వ్యవసాయశాఖ జేడీ త్రినాథ్ స్వామి, రాగోల్ రీసెర్చ్ సెంటర్ అజయ్ బాబు, ఏడీ మండేలా రామారావు, వ్యవసాయశాఖాధికారి జి.నాగరాజు, సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# రైతుల ఉజ్వల భవిష్యత్తే.. ప్రభుత్వ లక్ష్యం



**జలుమూరు, మార్చి 17(వార్త):** రైతుల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం జలుమూరు మండలం వెలమలవానిపేట గ్రామంలో నిర్వహించిన "రైతన్నా మీకోసం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కోసం చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సాగునీటి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బొంతు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించామని గుర్తుచేశారు. అయితే గత ప్రభుత్వ హయాంలో ఆ పనులు పూర్తిగా నిలిచిపోయాయని విమర్శించారు. అభివృద్ధి కంటే అప్పులు చేసి నిధుల పంపిణీపై మాత్రమే దృష్టి సారించారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వం చిత్తశుద్ధితో రైతు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ వంటి పథకాల నిధులు రైతుల ఖాతాల్లో జమయ్యాయా లేదా అని విచారించారు. నిధులు అందకపోతే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులు లేదా సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. రైతులు లాభసాటి వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని, రైతు ముఖంలో చిరునవ్వే ప్రభుత్వానికి నిజమైన విజయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, పిఎసిఎస్ ఛైర్మన్ దుంగ స్వామిబాబు, పర్లాం వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ ఛైర్మన్ కింజరాపు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తర్ర బలరాం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మునికోటి దాంబాబు, నీటి సంఘం అధ్యక్షులు జుత్తు అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జులు నక్క రమేష్ నాయుడు, తోణంగి రామారావు, సనపల రమణమూర్తి, మెండ సింహాచలం, కూన ధర్మారావు, అక్కాజోస్యాల ఉమాదత్తు బాబు, పిఎసిఎస్ డైరెక్టర్ కూన వీరన్నాయుడు, స్థానిక సర్పంచ్ వెలమల రామారావు, అలాగే తహశీల్దార్, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



**నరసన్నపేట, మార్చి 17(వార్త):** నరసన్నపేట మండలంలోని వరాహ నరసింహపురం (వీఎన్‌పురం) పంచాయతీలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందజేస్తున్నామని పశుసంవర్ధక శాఖ ఏడి ప్రసాద్ వర్మ తెలిపారు.

మంగళవారం పశు వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో పాడి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పశువులకు గాలికుంటు వంటి అంటువ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఈ వ్యాధి కారణంగా పశువుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా పాల ఉత్పత్తి కూడా తగ్గిపోతుందని పేర్కొన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు అందిస్తున్నదని, ప్రతి రైతు తన పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. సమయానికి టీకాలు వేయించుకుంటే వ్యాధి వ్యాప్తిని పూర్తిగా నియంత్రించవచ్చని వివరించారు. పశువుల ఆరోగ్యం కాపాడుకోవడం ద్వారా రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాడి రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## విజ్ఞాన వారోత్సవాల్లో ..
## మోడల్ పాఠశాల విద్యార్థికి తృతీయ స్థానం



**జలుమూరు, మార్చి 17(వార్త):** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన విజ్ఞాన వారోత్సవాల్లో భాగంగా జరిగిన పోస్టర్ పెయింటింగ్ పోటీల్లో జలుమూరు మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి మెండ లోచన్ తృతీయ స్థానం సాధించి ప్రతిభ చాటాడు. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్న లోచన్, జిల్లా స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ప్రదర్శనతో మూడో స్థానం పొందడం విశేషంగా నిలిచింది. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో అతని సృజనాత్మకతకు న్యాయనిర్ణేతలు ప్రశంసలు కురిపించారు. లోచన్ సాధించిన విజయంపై పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, మండలానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లోచన్‌ను ప్రోత్సహిస్తూ ఆయన ప్రతిభను మరింత అభివృద్ధి చేసేందుకు సహకరించాలన్నారు.

## మహిళలు, బాలల రక్షణపై అవగాహన




**పోలాకి, మార్చి 17(వార్త):** ప్రియాగ్రహారంలోని ప్రగతి పబ్లిక్ హైస్కూల్లో మహిళలు, బాలల రక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భద్రతా అంశాలపై వివరణాత్మకంగా సూచనలు అందించారు. టెక్కలి శక్తి టీమ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుళ్లు ఎం.గిరిధర్, కే.గణేష్ పాల్గొని మహిళలు, బాలల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, చట్టాల గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం పొందేందుకు శక్తి యాప్ వినియోగం ఎంత ముఖ్యమో వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని భద్రతా అంశాలపై అవగాహన పొందారు.

## మోడల్ స్కూల్‌కు జారుడు బల్ల విరాళం

### - పూర్వ విద్యార్థిని ప్రశంసించిన పాఠశాల సిబ్బంది




**జలుమూరు, మార్చి 17(వార్త):** శ్రీముఖలింగంలోని ప్రభుత్వ మోడల్ స్కూలుకు పూర్వ విద్యార్థి అమిత్ కుమార్ దాస్ జారుడు బల్లను విరాళంగా అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చింతాడ సత్యం తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఈ జారుడు బల్లను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.20 వేల వ్యయంతో దీనిని తయారు చేయించారని వివరించారు. విద్యార్థుల వినోదం, శారీరక వికాసానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల ప్రాంగణంలో విశాలమైన స్థలం ఉండటంతో విద్యార్థులకు ఆటపాటల కోసం అనువైన వాతావరణం కల్పించగలమని తెలిపారు. పూర్వ విద్యార్థి అందించిన ఈ సహకారం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని పూర్వ విద్యార్థికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఫ్ఎల్ఎన్ స్థాయిలపై ప్రత్యేక పరిశీలన

### - విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి కృషి
### - ఎంఈఓ బమ్మిడి మాధవరావు

**జలుమూరు, మార్చి 17(వార్త):** విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో అమలు చేస్తున్న ఎఫ్ఎల్ఎన్ (Foundational Literacy and Numeracy) స్థాయిలను విద్యార్థుల్లో ఎంత మేరకు అభివృద్ధి చెందాయో పరిశీలిస్తున్నామని ఎంఈఓ-1 బమ్మిడి మాధవరావు తెలిపారు. మంగళవారం జలుమూరు మండలం పెద్దదూగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల విద్యా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను విద్యార్థులకు ప్రతిరోజూ స్పష్టంగా తెలియజేసి, వారి చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆయన స్వయంగా విద్యార్థులకు డిక్టేషన్ నిర్వహించి వారి ప్రతిభను పరీక్షించారు. ఇలాంటి చర్యల ద్వారా విద్యార్థుల్లో ప్రాథమిక నైపుణ్యాలు బలపడటంతో పాటు విద్యపై ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలంటే ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత అవసరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మంచి విద్యాబోధనకు ప్రాధాన్యం

**నరసన్నపేట, మార్చి 17(వార్త):** విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మంగళవారం నరసన్నపేటలోని వంశధార కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న విద్యాబోధన విధానంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి విద్యతో పాటు విలువలతో కూడిన శిక్షణ అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిస్తూ వారి విద్యా స్థాయిని అంచనా వేసేందుకు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన ఎమ్మెల్యే, పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఆయన, ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డిస్తూ వారితో సన్నిహితంగా మెలిగారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ తనిఖీ కార్యక్రమం పాఠశాల సిబ్బందిలో చైతన్యం నింపడంతో పాటు, విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంపొందించింది.






## రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

### జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

**శ్రీకాకుళం, మార్చి 17 (వార్త):** జిల్లాలో రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలని, ఇన్వెంటరీ అప్డేషన్, స్కానింగ్ ప్రక్రియలో ఎటువంటి అలసత్వం వహించరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిజిటలైజేషన్ ప్రక్రియకు సంబంధించిన ఐదు విడతల షెడ్యూల్‌ను జేసీ వివరించారు. మొదటి విడతలో 2016-19 మధ్య గల ఇళ్ల స్థలాల రిజిస్టర్, డీకేటీ, ఏఆర్సీ రికార్డుల స్కానింగ్‌ను ఈ నెల 12 నాటికి పూర్తి చేయాలన్నారు. రెండో విడతలో భాగంగా సీలింగ్, సెటిల్మెంట్ 2016కు పూర్వపు ఇళ్ల స్థలాల రిజిస్టర్ల అప్‌లోడింగ్‌ను ఈనెల 31 నాటికి ముగించాలని సూచించారు. ఏప్రిల్ మాసంలో మూడు, నాలుగు విడతల కింద దేవదాయ, వక్ఫ్ బోర్డు భూములతో పాటు భూ సేకరణ రికార్డుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. చివరి విడతలో భాగంగా 10-1 రిజిస్టర్, మాన్యువల్ అడంగల్స్, మాన్యువల్ 1బి రిజిస్టర్ల డిజిటలైజేషన్‌ను ఏప్రిల్ 27న ప్రారంభించి మే 30 నాటికి సంపూర్ణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రికార్డుల భద్రత, ఖచ్చితత్వం విషయంలో తహసీల్దార్లు వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలని, సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, డిఆర్ఓ ఎస్వీ లక్ష్మణమూర్తి, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## సివిల్స్ విజేత రాముకు సన్మానం




**శ్రీకాకుళం, మార్చి 17 (వార్త):** ప్రభుత్వ బడిలో చదివి, పేదరికాన్ని జయించి సివిల్స్‌లో 463వ ర్యాంక్ సాధించి సత్తా చాటిన సారోతు రామును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో జిల్లా ఉన్నతాధికారులతో కలసి ఘనంగా సత్కరించారు. ఈ అపురూప ఘట్టానికి రాము తల్లి లక్ష్మి కూడా సాక్షిగా నిలిచారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది కలిసి రాముకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, విలువైన పుస్తకాలను బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాము ప్రతి విద్యార్థికి ఒక గొప్ప ఆదర్శమన్నారు. తల్లి కూలీ పనులు చేస్తూ కొడుకును తీర్చిదిద్దడం, తండ్రిని కోల్పోయినా కుంగిపోకుండా ఎన్ఐటీ వరంగల్‌లో చదివి, నేడు సివిల్స్‌లో ర్యాంకు సాధించడం సామాన్యమైన విషయం కాదని కొనియాడారు. రాము సాధించిన ర్యాంకుకు ఐపీఎస్ వస్తుందని భావిస్తున్నానని, ఐఏఎస్ కూడా వచ్చే అవకాశం ఉందని, ఏ విభాగంలో సేవలందించినా జిల్లాకు గర్వకారణమని ఆకాంక్షించారు. సత్కార కార్యక్రమం ముగిసిన అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. రాము తల్లిని గౌరవిస్తూ, ఆ తల్లికొడుకులను స్వయంగా కలెక్టర్ కార్యాలయం కింద వరకు తోడ్కొని వెళ్లి, మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికారు.

## రైతును రాజుగా చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్
- తండ్యాం గ్రామంలో 'రైతన్న మీకోసం' వారోత్సవాలు



**పొందూరు, మార్చి 17(వార్త):** పొందూరు మండలంలోని తండ్యాం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'రైతన్న మీకోసం' వారోత్సవాల్లో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 'రైతులకు గిట్టుబాటు కావాలి - పంచ సూత్రాలు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వంతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని, రైతు సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు ఇఫ్తార్ విందు

**శ్రీకాకుళం,మార్చి17(వార్త):** జిల్లాలో ఉన్న ముస్లీం మత పెద్దలకు బుధవారం ఇఫ్తార్ విందును నిర్వహించనున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి షైక్ మహబూబ్ షరీఫ్ మంగళవారం తెలిపారు. రంజాన్ శుభ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటల నుండి శశి కన్వెన్షన్ హాల్, రైస్ మిల్లర్స్ అసోషియేషన్ కళ్యాణ మండపం, జుడియో భవనం, 4వ అంతస్తు, జిల్లా పరిషత్ రోడ్డులో జరుగుతుందని వివరించారు. ఇఫ్తార్ విందు కార్యక్రమానికి జిల్లాలోని ముస్లిం మత పెద్దలు తప్పకుండా హాజరు కావలసినదిగా ఆయన కోరారు.

# సనాతన ధర్మం మన జీవన విధానం

- ప్రపంచమంతా వసుదైక కుటుంబం
- మానవుడు ఉన్నతి సాధించే మార్గమే సనాతనం
- ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు,
- ఏయూ మాజీ వీసీ జార్జ్ విక్టర్





**శ్రీకాకుళం, మార్చి 17(వార్త):** సనాతన ధర్మం (హిందూ ధర్మం) అత్యంత ప్రాచీనమైన, కాలాతీతమైన జీవన విధానమని .. అది అందరూ ఆచరించాలని ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ జార్జ్ విక్టర్, ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సనాతన ధర్మం భారతదేశ దార్శనికత అనే అంశంపై మంగళవారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది సత్యం, అహింస, కర్మ సిద్ధాంతం, వసుధైక కుటుంబకం (ప్రపంచమంతా ఒకే కుటుంబం) వంటి సార్వజనీన విలువలను సనాతన ధర్మం బోధిస్తుందన్నారు. వేదాలు, యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఉన్నతిని ప్రోత్సహిస్తూ, ప్రకృతిని ఆరాధించడం, సర్వభూత దయ, మత సహనాన్ని ఇది ప్రత్యేకంగా చాటుతుందని వివరించారు. సనాతన ధర్మం అనేది కేవలం మతం కాదు, ఇది సత్యం, ధర్మం, ఆత్మనిగ్రహం వంటి సద్గుణాల ద్వారా మానవుడు ఉన్నతి సాధించే మార్గమని పేర్కొన్నారు. ఇది వేల సంవత్సరాల క్రితం నుండి కొనసాగుతున్న, కాలానికి అనుగుణంగా మారగల జీవన శైలి అనే స్పష్టం చేశారు. ప్రకృతిని, చెట్లను, నదులను దేవతలుగా భావించి పూజించడం (ప్రకృతి ఆరాధన) సనాతన ధర్మంలో ఉందని ఇది పర్యావరణ పరిరక్షణకు మార్గం చూపుతుందని చెప్పారు. సనాతన ధర్మంతో క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు. విద్యార్థులు సనాతన ధర్మాన్ని పాటిస్తూ సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాడుపడాలని పిలుపునిచ్చారు. సనాతన ధర్మం వ్యక్తిగత వికాసంతో పాటు సామాజిక శ్రేయస్సును, తరతరాలుగా వస్తున్న సనాతన ధర్మం మానవాళికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా నిలుస్తోందని విద్యార్థులకు వివరించారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ వై.పోలినాయుడు, ఫిలాసఫీ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటరావు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# పలాస అభివృద్ధికి రూ.9కోట్లు సిద్ధం

- మోడల్ మున్సిపాలిటీగా తీర్చుదిద్దుతా
- అభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ సహకారం మరువలేనిది
- ఎమ్మెల్యే గౌతు శిరీష




**పలాస, మార్చి 17 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపల్ అభివృద్ధికి సుమారు తొమ్మిది కోట్ల రూపాయలు సిద్ధంగా ఉన్నాయని, ఈ జంట పట్టణాల అభివృద్ధికి మున్సిపల్ చైర్మన్ సహకారం మరువలేనిదని, ఈ మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చుదిద్దుతానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నా రు. మున్సిపాలిటీ పాలకవర్గ వీడ్కోలు సభలో మంగళవారం ఆమె పాల్గొని ఆమె మాట్లాడారు. 31 వార్డుల్లో ఎంతో మెజార్టీ ఇచ్చి గెలి పించిన ప్రజల రుణము తాను ఎప్పుడూ మర్చిపోనని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లలో చేసిన అభివృద్ధి కేవలం 21 నెలలులో తాను చేసిన అభివృద్ధి ఏమిటో నిరూపించగలనని సవాల్ విసిరారు. గౌరవం అనేది ఇచ్చి పుచ్చుకునే విధంగా ఉండాలని, కానీ సభ పూర్తిగా కాకుండానే వైసీపీ కౌన్సిలర్లు సభ నుంచి వెళ్లిపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 21 నెలల్లో చైర్మన్ తనకు పూర్తిగా సహకరించినందున ఆ పథకాలు ప్రజలకు దక్కాయన్నారు. చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు, మిత్రులు ఉండరని, పార్టీలతో పని లేకుండా అభివృద్ధి ధ్యేయంగా మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలనే దృక్ప థంతో పనిచేశానన్నారు. విలువలు, విశ్వసనీయత, నీతి, నిజాయతీకి కట్టుబడి ఉన్న వారికే ప్రజాక్షేత్రంలో స్థానం ఉంటుందన్నారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.విఠల్, కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, కర్రి మాధవరావు, సవర సోమేశు మీసాల సురేష్ తదితరులు మాట్లాడారు. అనంతరం గిరిబాబును, శిరీషను ఈ సందర్భంగా కౌన్సిలర్లు సన్మానించారు.




# ఇక అంతా మాజీలే!

- ముగిసిన ఇచ్ఛాపురం మున్సిపల్ కౌన్సిల్ పదవీకాలం
- సభ్యులకు ఘనంగా వీడ్కోలు
- ఎంతో అభివృద్ధి చేశా : రాజ్యలక్ష్మి
- ప్రత్యేకాధికారిగా టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

**ఇచ్ఛాపురం, మార్చి 17 (వార్త):** మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గం పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. ఇక మున్సిపల్ ప్రజాప్రతినిధులంద రూ మాజీలయ్యారు.

ఈ మేరకు కౌన్సిల్ హాల్‌లో వీడ్కోలు సభ మంగళవా రం ఘనంగా జరిగింది. గడిచిన పదేళ్ల పాటు 23 వార్డులకు ఒకేవిధంగా ప్రాధాన్యత ఇస్తూ అన్ని వార్డులను అందరి కౌన్సిలర్ల సహకారంతో అబి ,వృద్ధి పథంలో నడిపించానని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నా రు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో జరిగిన చివరి సమావేశంలో ఆమె మాట్లాడుతూ రూ1.52కోట్లతో 82 పనులు, 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.116కోట్లతో 29 పనులు, 15వ ఆర్థిక సంఘ నిధులతో రూ. 2.78కోట్లతో 14పనులు పూర్తి చేమని తెలిపారు. అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అందరికీ న్యాయం చేశానని. మనమంతా స్నేహపూర్వ కంగా ఉండాలన్నదే తనకోరిక అని తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి. వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతి దివ్య, లాభాల స్వర్ణమణితో పాటు మిగిలిన కౌన్సిలర్లకు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌ను.. సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. చైర్‌పర్సన్ రాజ్య లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ స్వర్ణమణి, కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, గేదెల శేఖర్, పరపటి మంజులత, బుడ్డేపు ఆదిలక్ష్మి, చిడిపోతు జగన్, కాళ్ల వెంక టలక్ష్మి రెండు పర్యాయాలు కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. చాట్ల పుష్ప, పత్రి తవిటయ్య, నారాయణ బెహరా, పల్లంటి మధు మూర్తి, బచ్చు జగన్, పి. తేజ, అశి లీలారాణి, నీలాపు లక్ష్మి, పిలక ఈశ్వరి, ఉలాల భారతీ దివ్య, టెంక లక్ష్మి, బొబ్బిలి భూదేవి, ఆదిరెడ్డి, కాళ్ల దిలీప్, గువ్వడా దిలీప్ తొలి సారిగా కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. కౌన్సిల్ పదవీకాలం గడువుకి 10 రోజుల ముందే ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఇచ్ఛా పురం మున్సిపల్ ప్రత్యేకాధికారిగా టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తిని నియమించారు.



## 24న ఎస్సీ కమిషన్ సభ్యుని రాక

**శ్రీకాకుళం,మార్చి17(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ఈ నెల 24వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు, వివిధ సంఘాల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం మున్సిపల్ అధికారులతో సమావేశమై, సాయంత్రం ఎస్సీ సంక్షేమ హాస్టళ్లు, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలను సందర్శిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

## 26న పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా అదాలత్


**శ్రీకాకుళం,మార్చి17(వార్త):** శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించు నిమిత్తం మెరుగైన సేవలు అందించడంలో భాగంగా ఈనెల 26న మధ్యాహ్నం రెండు గంటలకు సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరిండెంట్ వి. హరిబాబు తెలిపారు. శ్రీకాకుళం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 25లోగా సమాచారం అందజేయాలన్నారు. తపాలా అదాలత్ అనే శీర్షికతో వి.హరిబాబు, సూపరింటెండెంట్ ఆఫ్ ఆఫీసెస్ శ్రీకాకుళం, పోస్టల్ డివిజన్- శ్రీకాకుళం-532001 అనే చిరునామాకు పంపించాలన్నారు.

## నేడు జిల్లా సమీక్షా కమిటీ సమావేశం

**శ్రీకాకుళం,మార్చి17(వార్త):** జిల్లా అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 18వ తేదీన జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం పది గంటలకు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అధ్యక్షతన ఈ సమావేశం జరగనుందని సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

## ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి హరిబాబు
- గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ



**మెళియాపుట్టి, మార్చి 17 (వార్త):** విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని, ఉన్నత లక్ష్యాలతో చదువుకుని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు ఆకాంక్షించారు. మంగళవారం ఆయన భీంపురం గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో నేరుగా ముచ్చటించిన ఆయన.. పాఠశాలలో అందుతున్న పౌష్టికాహారం, మంచినీరు, ఇతర వసతులపై ఆరా తీశారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా సంకోచించకుండా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. బాలికలు ధైర్యంగా విద్యాభ్యాసం సాగించాలని, భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక బలోపేతమే నాబార్డు లక్ష్యం

**మెళియాపుట్టి, మార్చి 17 (వార్త):** గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే నాబార్డ్ ప్రధాన లక్ష్యమని, మునగ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా మహిళలు నెలకు రూ.10 వేల వరకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ పేర్కొన్నారు. మెళియాపుట్టి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నాబార్డ్ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సమాఖ్య అమలు చేసిన 15 రోజుల 'మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' మంగళవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మునగలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ఈ శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించడంతో పాటు, నాబార్డ్ ప్రాయోజిత ప్రదర్శనలు, రూరల్ మార్ట్స్ ద్వారా మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు 15 రోజుల పాటు శిక్షణ పొందారు. మునగ పొడి, లడ్డూలు, ప్రోటీన్ మిక్స్, మునగ టీ, ఫేస్ ప్యాక్, మోరింగా మిల్లెట్ పకోడి వంటి వినూత్న ఉత్పత్తుల తయారీలో వీరికి ప్రాయోగిక పరిజ్ఞానం అందించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎంలు ఈశ్వరరావు, త్రినాథమ్మ, మండల మహిళా సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546